

త్రివర్ణ కాంతులతో కలెక్టరేట్





టీటీడీ ఏడీ భవనం

తిరుపతి కలెక్టరేట్ త్రివర్ణ పతాక విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. శుక్రవారం నాటి 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం రాత్రే లైటింగ్ ఏర్పాటు చేశారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనమూ రంగురంగుల దీపపు కాంతులతో వెలుగులీనుతోంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

చిన్నారులకు 'చెత్త' ఆఫర్



చెత్తనివ్వండి.. బహుమతులు తీసుకెళ్లండి.. అంటూ చిన్నారులకు తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీ ఆఫర్ ఇచ్చింది. చాక్లెటు, బిస్కెట్లను తినేశాక ఆ ప్లాస్టిక్ కవర్లని రోడ్లపై పడేయకుండా పిల్లలను ప్రోత్సహించేలా ఈ నిర్ణయం తీసుకుంది. ఆ ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ కార్యాలయంలోని గ్రీన్ అంబాసిడర్లకు ఇచ్చి బహుమతులు తీసుకెళ్లే విధానానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల నుంచి ప్లాస్టిక్ కవర్లని తీసుకుని బహుమతిగా చాకెట్లు, పెన్నులు, పెన్సిళ్లను అందించడం ద్వారా బుధవారం ఎంపీడీవో రామచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపసర్పంచ్ సునీల్, కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి రూరల్, ఆంధ్రజ్యోతి

తిరుపతి దక్షిణ దశ మారుతోంది

- వేగంగా ఎన్‌హెచ్ 716 విస్తరణ
- ఏడాదిన్నరలో అందుబాటులోకి..

8



● వర్షం ఎఫెక్ట్

ఎస్వీయూ స్టేడియంలో ఏర్పాట్లు.. ఏఆర్ పోలీసుల రిహార్సల్స్



ఎస్వీయూ స్టేడియంలో స్వాతంత్ర్య దిన వేడుకలు



- పోలీస్ పరేడ్ మైదానం బురదగా మారడంతో మార్పు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం జరిగే 79వ జిల్లాస్థాయి స్వాతంత్ర్య దిన వేడుకులకు వేదిక మారింది. రెండు రోజుల వర్షానికి పోలీసు పరేడ్ మైదానం బురదమయంగా మారడంతో ఎస్వీయూ స్టేడియానికి మార్చారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు బుధవారం ఆదేశాలిచ్చారు. శుక్రవారమే కార్యక్రమం ఉండటంతో అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా అధికారులు స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించారు. పోలీసుల కవాతు, విన్యాసాలపై ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ వీఎస్ రమణ నేతృత్వంలో రిహార్సల్ నిర్వహించారు. కాగా, వేదిక మార్పును గమనించి ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు ఎస్వీయూ స్టేడియంలో జరిగే వేడుకలకు హాజరు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు కోరారు. ఇక, వివిధ శాఖల శకటాలు, స్టాళ్ల ఏర్పాట్లలో డీఆర్‌డీఏ, డ్వామా అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, గురువారం అతి భారీ వర్షం పడితే.. తుడాకు సంబంధించి కచ్చిపి ఆడిటోరియంలోనైనా వేడుకలు నిర్వహించాలని యంత్రాంగం భావిస్తోంది.

ముఖ్య అతిథిగా మంత్రి ఆనం



ఎస్వీయూ స్టేడియం కేంద్రంగా జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లా ప్రగతిపై సందేశమిస్తారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అన్ని శాఖల ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని జిల్లా తరపున శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ అమరావతిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి ఆహ్వానించారు.

- తిరుపతి కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

'ఆపరేషన్ సిందూర్' వ్యాసరచన పోటీల్లో తిరుపతి వాసి విజేత



జగపతి సోమశేఖర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ విధానాన్ని పునర్నిర్వించడం' అంశంపై భారత ప్రభుత్వ రక్షణ శాఖ జూన్ నెలంతా వ్యాసరచన పోటీలు నిర్వహించింది. దేశవ్యాప్తంగా 20,557 మంది పోటీల్లో పాల్గొన్నారు. 200 మందిని విజేతలుగా ప్రకటించారు. ఈ విజేతల్లో తిరుపతి దామినేడుకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జగపతి సోమశేఖర్ ఒకరు. ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆయన ప్రశంసాపత్రం అందుకోనున్నారు. ఈ మేరకు ప్రత్యేక ఆహ్వానం అందింది.

రేపు సాయంత్రం నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన 'స్త్రీ శక్తి' పథకం శుక్రవారం ప్రారంభంకానుంది. సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండులో సీఎం చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత అన్ని జిల్లాల ప్రధాన బస్టాండ్లలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ప్రారంభిస్తారు. సాయంత్రం 4-5 గంటల మధ్య ఈ-పాస్ యంత్రాలకు జీరో టిక్కెట్ జారీకి సంబంధించి గ్రీన్‌సిగ్నల్స్ లభించేలా చర్యలు చేపట్టారు. ఆధార్, ఓటర్, డ్రైవింగ్ లైసెన్సు వంటి రాష్ట్ర పరిధిలోని గుర్తింపు కార్డులను ఆధారంగా తీసుకుంటారు. వయస్సుతో నిమిత్తం లేకుండా జీరో టిక్కెట్ జారీ చేయనున్నారు. పథకం అమలులో ఎలాంటి లోటుపాట్లూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బుధవారం సాయంత్రం గూగుల్‌మీట్ ద్వారా ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఎండీ, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులకు ఆదేశాలు వచ్చాయి. అన్ని విభాగాల సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని, అవసరమైన మేరకు డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, పారిశుధ్య కార్మికులను అందుబాటులో ఉంచాలని, బస్టాండ్లలో మౌలిక సదుపాయాలకు కొరత రాకూడదని, భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయాలని, రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసు సాయం తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జైలు

తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 11 మందికి జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం సంచలన తీర్పు చెప్పారు. ఇందులో ఆరుగురికి రెండు రోజులు, ఇద్దరికి మూడు రోజులు, మరో ముగ్గురు మందుబాబులకు ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. ఇక, 24 మంది మందుబాబులకు రూ.10,000 వంతున రూ.2.40 లక్షల జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపి జైలు శిక్ష పడిన 11మందిని చూసి మిగిలిన మం దుబాబులు గుణపాఠం నేర్చుకోవాలని డీఎస్పీ రామకృష్ణమాచ్చారి విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ప్రభుత్వంలో గ్రావెల్ అక్రమ రవాణా కీలక పాత్ర పోషించాడా బడా నేత. ఇప్పుడూ ఆయన ఆధ్వర్యంలోనే గ్రావెల్ దందా మొదలైంది. అధికారం ఎటుంటే అటు వాలిపోయే కొందరు.. కూటమి ప్రభుత్వంలోనూ అక్రమ రవాణా సాగిస్తున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

ఇప్పుడూ వాళ్లే..!



వితలయ్యపాళెం చెరువులో అక్రమ తవ్వకాలు

గొల్లవారి కండ్రిగలో..




- సత్యవేడులో మళ్లీ మొదలైన గ్రావెల్ దందా

సత్యవేడు నియోజకవర్గంలో మళ్లీ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొద్దికాలంగా నిలిపివేసిన మాఫియా మళ్లీ తమ కార్యక్రమాలను విస్తరిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో మట్టి మాఫియా రెచ్చిపోయి ప్రకృతి సంపదను ధ్వంసం చేసిన విషయం విదితమే. ఎర్రమట్టి, గ్రావెల్‌కున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకుని రూ.వందల కోట్లు లూటీ చేశారు. గ్రావెల్ అక్రమ రవాణా ఆపాలని అప్పట్లో ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆదేశించినా అధికారులు మాత్రం నిబంధనలను అమలు చేయలేకపోయారు. ఫలితంగా నియోజకవర్గంలో రహదారులు ఛిద్రమై ప్రజలు ఇప్పటికీ ఆ బాధలు అనుభవిస్తూనే ఉన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రావెల్ తవ్వకాలకు విరామం ఏర్పడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఇప్పుడు నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా కోరలు చాచేందుకు ప్రయత్నిస్తోంది. రెండు రోజులనుంచి వరదయ్యపాళెం మండలం వితలయ్యపాళెం చెరువులో, నాగలాపురం మండలం గొల్లవారి కండ్రిగ ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలను సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రీ పగలు తవ్వి సరిహద్దు దాటిస్తున్నారు. రెండు మండలాల నుంచి భారీగా టిప్పర్లతో గ్రావెల్‌ను చెన్నైకు తరలిస్తున్నారు. వరదయ్యపాళెం మండలంలో గత ప్రభుత్వంలో గ్రావెల్ అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించిన ఓ బడా వ్యక్తి తన పలుకుబడితో మళ్లీ గ్రావెల్ రవాణా సాగిస్తున్నాడని సమాచారం. నాగలాపురం మండలంలోను గతంలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలో ఆరితేరి, వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన ఓ నాయకుడి కనుసన్నల్లో గ్రావెల్ తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీటికి అడ్డుకట్ట వేసే దిశగా అధికారులు స్పందించడం లేదు. కాగా, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న గ్రావెల్ టిప్పర్లను బుధవారం సాయంత్రం తడ సమీపంలో పోలీసులు దాడి చేసి పట్టుకోవడం గమనార్హం. దీనిపై వరదయ్యపాళెం తహసీల్దార్ సుధీర్‌రెడ్డిని వివరణ కోరగా మండలంలో గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్‌కు స్కోచ్ పురస్కారం



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ ఏటా ఈ పురస్కారాలను ఇస్తోంది. స్వర్ణనారావారిపల్లె కింద సి.రామాపురం,కందులవారిపల్లె, రంగంపేట పంచాయతీల్లో 45రోజుల్లో 1,600 గృహాలకు సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీనికిగాను కలెక్టర్ స్కోచ్‌కు ఎంపికయ్యారు.వచ్చే నెల 20న ఢిల్లీలో అవార్డు అందుకోనున్నారు. సీఎంచంద్రబాబు ప్రోత్సాహం, జిల్లా అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందని కలెక్టర్ వెంకటేశ్వర్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కలెక్టర్‌ను బుధవారం రాత్రి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి, ఎస్ఈ సురేంద్ర నాయుడు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.



శ్రీరామపురంలో ఇళ్ల మీద ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్

పాఠశాలకు స్ఫూర్తి ఫౌండేషన్ వితరణ



స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం కొటాల జడ్పీ ఉన్నత పాఠశాలకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.5 లక్షల విలువ గల డెస్కులు, ఆర్వో వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్, డైరెక్టర్లు మహేష్, మరుపూరి శేఖర్‌లు వితరణ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు, గురువులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. స్ఫూర్తి ఫౌండేషన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నారని కొనియాడారు. స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్, డైరెక్టర్లలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లలిత కుమారి, భాస్కర్‌బాబు, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, ప్రధానోపాధ్యాయులు కేశవులు, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ నాయకులు బాలకృష్ణమూర్తి, ప్రవీణ్‌చౌదరి, వేణుగోపాల్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

రామచంద్రాపురం,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రామాపురం గోవర్ధనగిరిపై వెలసిన చిన్మయి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా నవపాలికల్లో అంకురాలను మొలకెత్తించారు. అంతకుముందు తిరుమంజనం నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయత్రం ఆలయంలో విశేష పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు నాందిగా గురువారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. గోకులాష్టమికి సంబంధించి ఆలయంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ చీఫ్ ప్యాటరన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల కషాయాల తయారీ పై అవగాహన



తిరుపతిరూరల్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): వేమూరుగ్రామంలోని అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం రాయలసీమ జిల్లాల బయో ఇన్పుట్స్ రిసోర్స్ సెంటర్(బీఆర్సీ)యజమానులు సందర్శించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో బీఆర్సీ ప్రతినిధులకు నిర్వహిస్తున్న నాలుగురోజుల శిక్షణలో భాగంగా బుధవారం దీన్ని సందర్శించారు. ఇన్పుట్స్ తయారీలో భాగంగా బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, దశపర్ని కషాయాలు, పంచగవ్య తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. వీరికి కషాయాల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు నాగరాజు, నరేంద్ర, బీఆర్సీ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.11.14 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

చంద్రగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లి, కొటాల గ్రామ సచివాలయాల వద్ద ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. ఐతేపల్లి, కొటాల గ్రామ సచివాలయం పరిధిలో రూ.11.14 కోట్లతో పలు అభివృద్ధి పనులుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంమన్నారు. ఐతేపల్లి నుంచి ఎ.రంగంపేట రహదారి డబుల్ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటుతో మహిళలు శిక్షణ పొందారన్నారు. శిక్షణ పొందిన వారికి త్వరలోనే కుట్టు మెషిన్‌తో పాటు నైపుణ్య సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీలలో స్మశానవాటికలకు స్థలాన్ని గుర్తించి మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, ఎంపీటీసీ ఏసీ శేఖర్, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి,(జేసీఆర్), విశ్వనాథం, వెంకటముని, ప్రవీణ్‌చౌదరి, లోకాద్రినాయుడు, హేమశేఖర్ పాల్గొన్నారు.

నేడు ఎంబీయూ వద్ద హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

చంద్రగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్ద గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ విష్ణు, విద్యార్థులతో ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం నుంచి ఎ.రంగంపేట వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు,ఉపాధ్యాయులు, అధికారులు,శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొననున్నారు.

ఏపీఎంపై దాడికి నల్లబ్యాడ్జీలతో నిరసన



తిరుపతి రూరల్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండల ఏపీఎం రజనిపై దాడిని ఖండిస్తూ బుధవారం తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని స్త్రీశక్తి, ఉపాధి హామీ భవనం వద్ద ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఏపీఎంపై దాడిచేయడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీఎం దుర్వాసులునాయుడు, సీసీలు రమేష్, ధనంజయ, చిత్ర, సుజాత, వాహిని, రవి, దీప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పల్లకీసేవ



శ్రీకాళహస్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పల్లకీసేవ జరిగింది. ముందుగా స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ధ్వజానికి పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్బన్ పరిశ్రమ ఎదుట కార్మికుల ధర్నా



కార్మికులతో చర్చిస్తున్న పోలీసులు

రేణిగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రమ దోపిడీ ఆపాలంటూ కార్బన్ పరిశ్రమ మొదటి షిఫ్టులో విధులకు హాజరైన 1400 మంది కార్మికులు ధర్నా చేశారు. బుధవారం ఉదయం తిరుపతి విమానాశ్రయం సమీపంలోని కార్బన్ పరిశ్రమ వద్ద కార్మికులు రెండు గంటల పా టు ధర్నా చేయడంతో ఉద్రి క్త వాతావరణం తలెత్తింది. విషయం తెలుసు కున్న డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర సిబ్బందితో పరిశ్రమకు చేరుకొని ధర్నాకు దిగిన కార్మి కులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... కార్బన్ కంపెనీ అనుబంధ సంస్థ లియో లింక్ యాజ మాన్యం తమ శ్రమ దోపిడీ చేస్తోందని మండి పడ్డారు. రోజుకు 8 గంటలు పని చేయాల్సి ఉం డగా, 12గంటలు చేయించుకుంటోందన్నారు. ఇక పరిశ్రమలో మౌలిక వసతులు లేవని, సరైన భోజనం కూడా పెట్టడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని చెప్పారు. ప్రతి నెలా అదనంగా జీతం నుంచి కటింగులు చేస్తోం దన్నారు. ఈ సందర్భంగా కార్బన్ పరిశ్రమకు చెందిన అస్గర్ కార్మికులతో మాట్లాడుతూ... సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్తానని, జీతాల్లో కోతలపై కూడా చర్చిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో కార్మికులు తిరిగి విధులకు హాజరయ్యారు.

చంద్రగిరి

ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయ్?

● ఎస్వీయూ స్టేడియాన్ని పరిశీలించిన కమిషనర్



తిరుపతి, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్వాతంత్ర్య దిన వేడుకలు నిర్వహించే ఎస్వీయూ స్టేడియంలో ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయంటూ బుధవారం నగరపాలక సంస్థ, తుడా, రెవెన్యూ, పోలీసు అధికారులతో కలసి కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. వర్షపునీటితో పోలీస్ పెరేడ్ గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఈ వేడుకలకు ఎస్వీయూ స్టేడియాన్ని ఎంచుకున్నారు. ముఖ్య అతిథులు, అధికారులు, అవార్డుగ్రహీతలు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా.. వీక్షకులకు గ్యాలరీలను ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేశారు. ప్రజల సందర్శనార్థం ఎగ్జిబిషన్ స్టాల్స్ ఎక్కడ ఏర్పాటు చేయాలని అంశాలపైన అధికారులతో చర్చించారు. కమిషనర్ వెంట డీఆర్వో నరసింహులు, తుడా ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ మహేష్ తదితరులు ఉన్నారు. స్టేడియంలో నిర్వహించనున్న వేడుకలకు ప్రజలు, వాకర్స్ సహకరించాలని కమిషనర్ కోరారు.

భానుప్రకాష్‌రెడ్డికి టీటీడీ చైర్మన్ పరామర్శ



తిరుమల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కుటుంబాన్ని చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం పరామర్శించారు. భానుప్రకాష్ రెడ్డి తల్లి అరుణమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. తిరుపతిలోని భానుప్రకాష్‌రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అన్నమయ్య కీర్తనలకు మరింత ప్రాచుర్యం: ఈవో

తిరుమల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలను యువతకు మరింతగా చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలో టీటీడీజేఈవో వీరబ్రహ్మంతో కలిసి బుధవారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలపై ప్రాంతీయ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పోటీలు నిర్వహించి యువతను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రాచుర్యంలోకి రాని కీర్తనలను కూడా సకాలంలో రికార్డు చేసి భక్తి ప్రపంచానికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య కీర్తనలకు యూట్యూబ్ ఛానల్ ద్వారా మరింత ప్రచారం చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. నవతరం గాయకుల గాత్రం ద్వారా వీటిని రికార్డు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో హిందూ ధార్మిక్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి రాజగోపాల్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు, డాక్టర్ లత, ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

తెలంగాణలోనూ అందరి కులదైవం వెంకన్నే!



శ్రీనివాస్‌గౌడ్

తిరుమల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలు వేరైనప్పటికీ తెలంగాణలోని ప్రతి ఇంటి కుల దైవం శ్రీవేంకటేశ్వర స్వామే అని తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, బేధాభిప్రాయాలు లేకుండా అన్ని ప్రాంతాల్లో టీటీడీ దైవ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మహబూబ్‌నగర్‌లోని మణ్యంకొండ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కల్యాణమండపం కావాలని టీటీడీని కోరామన్నారు. తెలంగాణలోని జిల్లా కేంద్రాల్లోనూ శ్రీవారి ఆలయాలు, కల్యాణమండపాల నిర్మాణం జరిగితే బ్రహ్మాండంగా ఉంటుందన్నారు.

శ్రీవారి సేవలో విష్ణువర్ధన్‌రెడ్డి

తిరుమల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ దర్శించుకున్నారు.

మద్యం మత్తులో టీటీడీ ఉద్యోగి చిందులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మెయిన్ గేటు వద్ద బుధవారం రాత్రి విధి నిర్వహణలో ఉన్న ఓ సెక్యూరిటీ సిబ్బంది మద్యం మత్తులో చిందులేశారు. ఆ దారిలో వెళ్ళే వారితో పాటు ఒక ఫొటోగ్రాఫర్‌పైనా దురుసుగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఏవీఎస్వో కృష్ణయ్య దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా వెంటనే అతన్ని బయటకు పంపేశారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ అంశాన్ని సీవీఎస్వో మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూడు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగడులు చోరీకి పాల్పడ్డారు. బేకరి, కూల్ డ్రింక్స్ షాప్, జనరల్ స్టోర్టులో మంగళవారం రాత్రి రూ.50వేలకు పైగా చోరి చేసినట్లు దుకాణదారులు తెలిపారు. బేకరిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో నిందుతుడును చోరీ చేసే దృశ్యాలు నమోదయ్యాయి. దుకాణ యజమానులు చంద్రశేఖరశెట్టి, హిమాచలం, శరవణ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసి సీసీ ఫుటేజీని అందజేశారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు చోరీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఆనందగిరిలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అక్కగార్ల పూజ చేస్తున్న ఉభయదారులు



గజమాలధారుడైన సుబ్రహ్మణ్యస్వామి

పాకాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉభయదారులు ఏటుకూరి లలితా కుటుంబీకులు అక్కగార్ల పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. సాయంత్రం బొల్లినేని కృష్ణమనాయుడు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో గణపతిపూజ, కంకణదారణ, పుణ్యాహవాచనం, వాస్తుశాంతి, కలశస్థాపన హోమం జరిగింది. రాత్రి ఉభయదారులు వి.శ్రీనివాసపిళ్లై, కోరా ప్రకాష్‌నాయుడు, ఆర్.నారాయణస్వామి, మదురాచారి, వి.రాంబాబునాయుడు, సంద్ర మురళీధర నాయుడు, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో మూషికవాహనంపై వినాయకస్వామి ఊరేగిగారు. 16న ఆడికృత్తిక పురస్కరించుకొని విశేష సంఖ్యలో స్వామివారి దర్శనానికి భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాకాల నుంచి ఊట్లవారిపల్లె ఆనందగిరి ఆలయం వరకు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలు చేశారు. ఆలయ పరిసరాలలో చలువ పందిళ్లు వేసి పుష్పాలంకరణలు చేశారు. మండల టీడీపీ ఆధ్వర్యంలో 5 రోజులూ అన్నప్రసాదాలు అందజేయనున్నారు. పలువురు భక్తులు స్వామివారికి పుష్పకావిళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా సాయంత్రం ఎమ్మెల్యే నాని ఇక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవ కమిటీ చైర్మెన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, కార్యనిర్వహణ అధికారి యువరాణి, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు హెచ్ఎస్ కృష్ణమూర్తి శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో ట్రాఫిక్ ప్రక్షాళన

● సాయంత్రం 5 నుంచి 7 వరకు గరుడ వారధిపైనే బస్సుల ఎంట్రీ

● పూర్ణకుంభం సర్కిల్ వద్ద భారీ వాహనాల మళ్లింపు

● ముగ్గురు సీఐలకు బాధ్యతలు



రామానుజసర్కిల్ వద్ద ట్రాఫిక్ కంట్రోలు చేస్తున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ట్రాఫిక్ ప్రక్షాళన మొదలైంది. సమస్య తీవ్రంగా ఉన్న పూర్ణకుంభం సర్కిల్ వద్ద పరిష్కార చర్యలు బుధవారం మొదలు పెట్టారు. నగరంలో ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, కపిలతీర్థం, రామానుజ సర్కిల్, తిరుచానూరు రోడ్డు, బాలాజీ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, తిరుమల బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విపరీతమైన ట్రాఫిక్‌తో వాహనదారులు నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా రైల్వే స్టేషన్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్ళాలంటే గంటల తరబడి మానసిక క్షోభ అనుభవించాల్సి వుండేది. దీంతో ట్రాఫిక్ ప్రీ పెయిడ్ కౌంటర్ వద్ద ప్రత్యేకంగా పోలీసులను నియమించారు. ఇటీవల ఎస్పీ హర్షవర్ధన రాజు వాకింగ్ చేసుకుంటూ ట్రాఫిక్ రద్దీ కూడళ్ళను తనిఖీ చేశారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేశారు. ప్రాథమికంగా పూర్ణకుంభం సర్కిల్ వద్ద రోడ్డుపై ఆపి వున్న ట్రావెల్ బస్సులు జెండా రోడ్డులో దూరంగా తీసుకెళ్లి నిలిపేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి స్వయంగా రద్దీ ప్రాంతాల్లో తిరిగి అన్ని చోట్ల ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నారు. భారీ వాహనాలను సాయంత్రం 5 నుంచి తిరుపతిలోకి అనుమతించకుండా చర్యలు తీసుకోవడంతో బస్టాండు నుంచి అన్ని రూట్లలో ట్రాఫిక్ సాఫీగా వెళుతుంది. ఇకపై ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 లేదా 8 గంటల వరకు ఆర్టీసీ బస్సులు గరుడ వారధి పైనే వచ్చి బస్టాండులోకి వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో ట్రాఫిక్ దాదాపు తగ్గింది. ఇక రామానుజం సర్కిల్ వద్ద బ్యారికేడ్లు వుంచి వన్‌సైడ్‌గా వాహనాలను బస్టాండు వైపు అనుమతిస్తున్నారు. అలాగే రద్దీ ఎక్కువగా వున్న కూడళ్లలో దశల వారీగా ట్రాఫిక్ ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నామని ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి ఆంధ్రజ్యోతికి చెప్పారు. ఇందులో భాగంగా సీఐ సంజీవ్‌కుమార్‌ను పూర్ణకుంభం సర్కిల్ వద్ద, భాస్కర నాయక్‌ను రామానుజ సర్కిల్ వద్ద, సుబ్బరామిరెడ్డిని కపిలతీర్థం సర్కిల్ వద్ద ఇన్‌చార్జులుగా నియమించారు. ట్రావెల్స్ బస్సులు రాత్రి 9 గంటలపైన నగరంలోకి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. 10 నిమిషాలకంటే ఎక్కువగా ఆపకుండా వెళ్ళి పోవాలని విజ్ఞప్తి చేశారు.



పూర్ణకుంభం సర్కిల్ వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి జెండా రోడ్డులోకి వాహనాల మళ్లింపు

ఎస్వీయూలో డ్రోన్ అనుకూల వాతావరణం పరిశీలన



అనుకూల వాతావరణాన్ని పరిశీలిస్తున్న సివిల్ ఏవియేషన్ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలో ఆర్పీటీవో కోసం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారుల బృందం పర్యటించింది. రెండు రోజులుగా ఈ బృందం వర్సిటీలో యూనివర్సిటీలో డ్రోన్ అనుకూల వాతావరణాన్ని అధ్యయనం చేసింది. ఈ బృందంలో డిప్యూటీ డైరెక్టర్ (ఆపరేషన్స్) కుంజ్ లత, చేతల్ సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఎయిర్ వర్తినెస్, డ్రోన్ డైరెక్టరేట్) ప్రణవ్ చిట్టే, ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అంజలి తదితరులు ఉన్నారు. రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఆర్‌టిపిఓ) కోసం డ్రోన్ సిమ్యులేటర్ సాఫ్ట్‌వేర్, ఇతర ప్రాక్టీస్ క్లాస్ రూమ్ సదుపాయాలను పరిశీలించారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఎస్వీయూలో స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్, వర్చువల్ ప్రొడక్షన్ వంటి కోర్సులను ప్రవేశ ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ధర్మారెడ్డి, ఇంజినీర్ తాండవకృష్ణ, రుసా సీఈవో వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 వేడుకలకు టీటీడీ పరిపాలనా భవనంలో ఏర్పాట్లు



తిరుమల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ఆగస్టు15న 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలోని పరేడ్ మైదానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. జాతీయ జెండా వందనం అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభను కనపరిచిన వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఐదు గ్రాముల వెండి డాలర్, ప్రశంసాపత్రాలను అందజేస్తారు. టీటీడీ విద్యాసంస్థల విద్యార్థులు, ఉద్యోగుల పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా బుధవారం ట్రయన్ రన్ నిర్వహించారు.

మూడు దుకాణాల్లో చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూడు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగడులు చోరీకి పాల్పడ్డారు. బేకరి, కూల్‌డ్రింక్స్ షాప్, జనరల్ స్టోర్టులో మంగళవారం రాత్రి రూ.50వేలకు పైగా చోరి చేసినట్లు దుకాణదారులు తెలిపారు. బేకరిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో నిందుతుడును చోరీ చేసే దృశ్యాలు నమోదయ్యాయి. దుకాణ యజమానులు చంద్రశేఖరశెట్టి, హిమాచలం, శరవణ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసి సీసీ ఫుటేజీని అందజేశారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు చోరీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఇదేమి గొడవ!

● ఓ వ్యక్తి తీరుపై డయల్ 100కు స్థానికుల ఫిర్యాదు

● పట్టుకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ పోలీసులకు బెదిరింపు



ఈశ్వరరెడ్డి ఇంటి వద్ద మంట

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ కుటుంబ సభ్యులతో పాటు భార్యతో గొడవ పడడం, ఇంట్లో వస్తువులు పడేయడం.. అతడి తీరుతో ఇబ్బంది పడ్డ స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా.. తనను పట్టుకోవడానికి వస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ హెచ్చరించాడు. తిరుపతి రూరల్ పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం ప్రియదర్శిని కాలనీకి చెందిన బిరుదాల ఈశ్వరరెడ్డికి ఇద్దరు భార్యలు. గతంలో ఓ లైంగిక దాడి కేసులో జైలు కెళ్లిన ఈయన రెండు నెలల కిందటే బయటకు వచ్చాడు. ఈ రెండు నెలలుగా భార్యతో పాటు కుటుంబ సభ్యులతో ఘర్షణ పడడం, దురుసుగా ప్రవర్తించేవాడు. బుధవారం మళ్లీ రెండో భార్యతో ఘర్షణకు దిగాడు. వారిద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో ఇంటి వద్ద వున్న చెత్తకు అగ్గి పెట్టి అందులో కుర్చీలు, ఫర్నిచర్ వేశాడు. అంతే కాకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడి గట్టిగా అరుస్తుండడంతో చుట్టు పక్కల వారు డయల్ 100 కు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి అతన్ని మందలించి అదుపులోకి తీసుకోవడానికి పలుసార్లు ప్రయత్నించినా గ్యాస్ సిలిండర్ ఆన్ చేసి ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించడంతో చేసేదేమి లేక వెనుదిరిగారు. దీనిపై తమకు బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ చిన్నగోవిందు చెప్పారు.

ముక్కంటి సేవలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపం డితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

చల్లంగా దీవించు తల్లీ!

నడివీధి గంగమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు







ప్రత్యేక అలంకరణలో నడి వీధి గంగమ్మ - అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు - గంగమ్మ సేవలో మబ్బు దేవనారాయణ రెడ్డి

రేణిగుంట ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం మూడో రోజు తెల్లవారు జామున గంగమ్మ అత్తగారి ఇల్లైన చాకలి ఇంటి నుంచి పసుపుతో తయారుచేసిన గంగమ్మ ప్రతిరూపాన్ని ఊరేగిస్తూ నడి వీధి త్రిశూలం వద్దకు చేర్చారు. ఆనవాయితీలో భాగంగా భక్తులు అమ్మవారి ముందు కుంభం పోశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. రాత్రి వేప తడికలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి ఊరి పొలిమేర్లలో నాలుగు దిక్కుల తిరిగిన అనంతరం అమ్మవారి శిరస్సును మేళ తాళాలతో, డప్పు వాయిద్యాల నడుమ జలజలో కలపడంతో జాతర సమాప్తమైంది.

తిరుపతి

17న మెగా ఉచిత వైద్య శిబిరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

తిరుపతి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్, మహాత్మపూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, దళిత నేత అంజయ్య తెలిపారు. బుధవారం బాలాజీకాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మాజీ మంత్రి పరసా రత్నం సతీమణి పి.కస్తూరమ్మ 5వ వర్ధంతి సందర్భంగా వచ్చే ఆదివారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని రకాల జబ్బులకు పరీక్షలు చేసి, మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి శరత్‌కుమార్, జగదీష్, గిరి, రవికుమార్, నగేష్ పాల్గొన్నారు.

పార్కు స్థలంలో వర్షపు నీరు



నీరు ఇళ్లలోకి రాకుండా వేసిన అడ్డుకట్ట

తిరుపతి(జీవకోన), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని వెంకటరెడ్డికాలనీ సమీపంలో గల శ్రీసాయి విష్ణు లేఅవుట్ పెద్ద పార్కు స్థలంలో వర్షపు నీరు చేరింది. ఆ స్థలం తగ్గు ప్రాంతంలో ఉండటంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది బుధవారం పరిశీలించి, నీరు ఇళ్ల వైపు రాకుండా మట్టితో అడ్డుకట్ట వేశారు. లేఅవుట్ ఏర్పడి 35ఏళ్లకు పైగా అవుతున్నా పార్కు అభివృద్ధి, కాలువలు, రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరకంబాడి రోడ్డులో అస్తవ్యస్తంగా ట్రాఫిక్



గోవిందదామం సమీపంలో నిలిచిపోయిన వాహనాలు

తిరుపతి(రవాణా), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం ఈ మార్గంలో ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బుధవారం ఉదయం 9.25 గంటల ప్రాంతంలో గోవిందధామం దగ్గర ట్రాఫిక్ స్తంభించింది. నలువైపుల నుంచి వాహనాలు ఇష్టానుసారం రావడంతో సమస్య ఏర్పడింది. దాదాపు అరగంట వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు, పనులకు వెళ్లేవారు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. అనంతరం ఓ కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరింపజేశారు.

కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించాలి



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి) : నగరంలోని అన్ని కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్(చెత్త, పేరుకుపోయిన మట్టి) తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఎల్ఐసీ రోడ్డు, ఆఫీసర్స్ క్లబ్, రామకృష్ణాపురం, హమీద్‌నగర్, మంచినీళ్ల గుంట తదితర ప్రాంతాలను ఆమె పరిశీలించారు. డ్రైనేజీలు లీకవుతున్నాయని, వర్షపు నీరు ఆగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కాలువల్లో సిల్ట్ తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసీపీ మధు, డీఈలు తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మ హత్య చేసుకున్న ఘటన బుధవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరరెడ్డి వివరాల మేరకు.. ప్లాట్‌ఫాం మూడులో ఉదయం 11.15 గంటల సమయంలో గుర్తు తెలియని యువకుడు అటూఇటు తిరుగుతున్నాడు. ఆ సమయంలో ఆ ప్లాట్‌ఫాంలో వెళుతున్న యాక్సిడెంటల్ రిలీఫ్ రైలు కిందపడి మృతిచెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదు. శరీరంపై కుడి పక్క చెస్ట్‌పై ఆ, ఈ అనే హిందీ అక్షరాలు, అంజనేయస్వామి పచ్చబొట్టు ఉంది. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు రైల్వే హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరరెడ్డిని 9440352765లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు బుధవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో అధికారులు, ఉద్యోగులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్టేషన్ ప్రధాన ముఖద్వారం నుంచి పార్సిల్ కార్యాలయం వరకు, అక్కడి నుంచి ప్లాట్‌ఫారం ఒకటి మీదుగా ఎస్ఎంఆర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అధికారులు చినరెడ్డెప్ప, రమణరావు, జగన్మోహన్, ప్రసాద్, గౌస్‌బాషా, యశ్వంత్, ఈశ్వర్ పాల్గొన్నారు.

పద్మావతి కాలేజీలో..



తిరుపతి (విశ్వవిద్యాలయాలు): పద్మావతి డిగ్రీ కాలేజీలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వెయ్యి మీటర్ల పొడవు గల జాతీయ పతాకాన్ని రెండువేల మందితో ఈ ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య వీరుల త్యాగాలను ఈ తరం గుర్తుంచుకోవాలన్నారు. ఆ స్ఫూర్తితో దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ యువతలో సమైక్యతా భావన పెరగాలన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీకి పూర్వ విద్యార్థి విరాళం



ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డికి చెక్కు అందిస్తున్న గోవిందమ్మ

తిరుపతి(విద్య), ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1984-87 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి, ఎన్నారై వై.సురేష్‌బాబు కళాశాల అభివృద్ధి కోసం రూ.1.71,690లక్షలు విరాళంగా అందజేశారు. కళాశాలలో హైడ్రాలిక్ ల్యాబ్, విలువైన ఓపెన్ ఛానల్ ఫ్లో పరికరం కొనుగోలుకు ఆయన తల్లి గోవిందమ్మ ద్వారా బుధవారం చెక్కును ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డికి అందజేశారు. సివిల్‌విభాగం హెడ్ పి.సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీవైఈవోకు ఆపస్ నేతల అభినందన



డీవైఈవోను అభినందిస్తున్న ఆపస్ నేతలు

తిరుపతి(విద్య), ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): తిరుపతి డీవైఈవోగా బాధ్యతలు చేపట్టిన జి.ఇందిరాదేవిని బుధవారం ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) ఆధ్వర్యంలో పలువురు టీచర్లు మార్యదపూర్వకంగా కలసి అభినందిం చారు. రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ నేతృత్వంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాంబిరెడ్డి, నాయకులు సుభాష్‌చంద్రదాస్, సురేష్, ప్రసాద్‌రాజు, మహేష్ కలసి దుశ్శాలువా, మెమెంటోతో సన్మానించారు.

ఎడ్యుకేషన్ డీన్‌గా వెంకట్రావు



నియామక పత్రాన్ని అందుకుంటున్న వెంకట్రావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ డీన్‌గా పి.వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ కృష్ణమూర్తి నియామక ఉత్తర్వులను అందజేసి, అభినందించారు.

ముగిసిన సంస్కృత వారోత్సవాలు



ముగింపు సభలో మాట్లాడుతున్న గీర్వాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా జాతీయ సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన సంస్కృత భాషా వారోత్సవాలు ముగిశాయి. సంస్కృత భాషా సాహిత్యాంశాలపై నిపుణుల చేత ప్రసంగాలు, విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను కేరళలోని చిన్మయ యూనివర్సిటీ ప్రొ-వైస్ చాన్స్‌లర్ గీర్వాణి అందజేశారు. మన దేశ విజ్ఞానానికి మూలం సంస్కృతమేనని అభిప్రాయపడ్డారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు సంస్కృత భాషా సాహిత్యాల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ నారాయణరావు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో చిరుజల్లులు

వ్యాపారులకు సంకటం - పులకించిన పూదోటలు



తిరుమల గిరులను కమ్మేసిన పొగమంచు





ఏడుకొండల స్వామితో దోబూచులాడుతున్న పొగమంచు

తిరుపతి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో తిరునగరిలో బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురిశాయి. క్షణకాలం విరామం లేకుండా చినుకులు రాలుతూనే ఉన్నాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. మార్కెట్లు, ఇతర వాణిజ్య సముదాయాలు వ్యాపారాలు లేక బోసిపోయాయి. అభివృద్ధి పనులకు, నిర్మాణ రంగానికి ఆటంకం కలిగింది. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లకు అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు. చలి వాతావరణంతో చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారు. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో పలువురు ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. కాగా చిరుజల్లులకు ఉద్యానవనాలు, డివైడర్ గార్డెన్స్, మిద్దెతోటలు పులకించాయి. శేషాచల ముఖభాగం గిరులను శ్వేత మేఘాలు ముద్దాడుతూ ఆవిష్కృతమైన దృశ్యాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందుచేశాయి. పుష్పాలు, పత్రాలపై నీటి బిందువుల వరుస అమితంగా ఆకట్టుకుంది.







పువ్వులపై నీటి బిందువుల సోయగం





వర్షంలో తడుస్తూ వెళుతున్న భక్తులు - ప్లాస్టిక్ కవర్‌ను గొడుగులా చేసుకుని సేద తీరుతున్న మహిళ

ఆటోలపై రవాణా, పోలీసు శాఖల స్పెషల్ డ్రైవ్

60 ఆటోలపై కేసు నమోదు - రూ.2లక్షల జరిమానా విధింపు



ఆటోలను తనిఖీ చేస్తున్న రవాణా, పోలీసు శాఖ అధికారులు

తిరుపతి(రవాణా)/(నేరవిభాగం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆటోలపై రవాణా, పోలీసు శాఖల స్పెషల్ డ్రైవ్ బుధవారమూ కొనసాగింది. రైల్వే స్టేషన్, బస్టాండు, మంగళం రోడ్డు తదితర ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ తిరుపతికి వచ్చే భక్తులు, పర్యాటకుల గౌరవానికి భంగం కలగకుండా చూడాలని డ్రైవర్లకు సూచించారు. ప్రవర్తన, మాటతీరు, డ్రైవింగ్ నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలపై తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తనిఖీలలో భాగంగా 60 ఆటోలపై కేసులు నమోదు చేసి, రూ.2లక్షలు అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆటోడ్రైవర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, మోహన్‌కుమార్, రమణనాయక్, అంజనేయప్రసాద్, ట్రాఫిక్ సీఐ భాస్కర్‌నాయక్, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

రేణిగుంట ఎంఈవోకు డీవైఈవోగా పదోన్నతి



ఎమ్మెల్యే ఆరణిని కలసిన ఇందిరాదేవి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండల విద్యాశాఖ అధికారి ఇందిరాదేవికి తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమె బుధవారం డీవైఈవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును, డీఈవో కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలువురు ఎంఈవోలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 27వ తేదీ వరకు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం స్కూల్ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో లేదా 8688888802/ 03, 9399976999లను సంప్రదించాలని కోరారు.

అమ్మవారి సేవలో వేమిరెడ్డి దంపతులు



ఆలయం ముందు వేమిరెడ్డి దంపతులు

తిరుచానూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ రమేష్ వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేమిరెడ్డి దంపతులను ఆలయ అర్చకులు ఆశీర్వదించి, అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

అవయవదానంతో పునర్జన్మ ఇవ్వవచ్చు



అవయవదానంపై అవగాహన పత్రం విడుదల చేస్తున్న ప్రముఖులు

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవయవదానం ద్వారా మరొకరికి పునర్జన్మ ఇవ్వవచ్చునని డాక్టర్ సతీష్ నాయక్, టి.దామోదరం, ఎస్‌వీఎస్ ప్రసాద్ వెల్లడించారు. ప్రపంచ అవయవదానం దినోత్సవం సందర్భంగా యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో బుధవారం మహాప్రస్థాన సేవాసమితి, గోవిందదామం, వేమన విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు అవయవదానం-అవయవాల మార్పిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మనిషి మృతిచెందిన ఆరు గంటల్లోపు కళ్లు, పూర్తి శరీరం ఉపయోగపడతాయని చెప్పారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, పేగులు, ఎముకలు, మూలగ, చర్మం లాంటివి తీసుకోవచ్చని వివరించారు. డాక్టర్లు హిమబిందు, శివపార్వతి మాట్లాడుతూ అవయవ దానంపై ప్రజల్లో అపోహలను తొలగించడానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అవగాహన ప్రచార పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జె.లక్ష్మి, ఎన్.రామశేఖర్, హేమచందర్, మల్లారపు నాగార్జున, భూమన్, జయరాం, ప్రసాద్, ముఖేష్, గురునాథం పాల్గొన్నారు.



ట్రిపుల్ రైడింగ్ వెళుతున్న యువకులు, విద్యార్థులు

ట్రాఫిక్ ఉల్లం‘ఘనులు’

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఎంత చెప్పినా, ఎన్ని డ్రైవ్‌లు చేపట్టినా తిరుపతిలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు తలకెక్కడంలేదు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. బుధవారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో పలువురు యథేచ్ఛగా ట్రిపుల్ రైడింగ్ చేస్తూ కనిపించారు. భవానీనగర్, బాలాజీ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, పూర్ణకుంభం సర్కిల్‌తో పాటు కళాశాలలు ఉన్న అన్ని రోడ్లపై యువకులు, విద్యార్థులు ట్రిపుల్ రైడింగ్‌లో వెళుతున్నారు. ఒక్కరూ హెల్మెట్ ధరించలేదు.

పట్టించుకోండి సారూ..!

రోడ్డు పైకి మురుగునీరు



నగర పరిధిలోని 1వ డివిజన్ అక్కారంపల్లి వద్ద గతంలో రోడ్డు నిర్మించారు. కాలువ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. మురుగునీరు వెళ్లడానికి అవకాశం లేక కుంటలా తయారైంది. వర్షాలు పడుతుండటంతో రోడ్డుపైకి వస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- తిరుపతి(జీవకోన), (ఆంధ్రజ్యోతి



ముసురు మబ్బుల్లో తిరుమల


తిరుమలలో బుధవారం చిరు జల్లులు, చల్లగాలులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. వానమబ్బులు కమ్మేసి తెల్లవారుజాము నుంచీ వాన కురుస్తూనే ఉంది. భక్తులు తడుస్తూనే తిరిగారు. సాయంత్రానికి చలి పెరిగింది. వరుస వానలతో కొండచరియలు జారే ప్రమాదం ఉన్నందున ఘాట్‌రోడ్లలోని కొన్ని ప్రాంతాల్లో విజిలెన్స్, ఫారెస్ట్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తిరుపతిలోనూ ఎడతెరపిలేని చిరుజల్లులు పడ్డాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

స్విమ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ వైరాలజీ విభాగంలోని కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 6న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకాగలని రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్విమ్స్‌లోని పాత డైరెక్టర్ కార్యాలయ కమిటీ మందిరంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించే ఈ ఇంటర్వ్యూకు అభ్యర్థులు ఒరిజినల్, నఖలు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. 40 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు.

సర్వదర్శనానికి 11 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,596
తలనీలాలు సమర్పించినవారు: 31,565



తిరుపతి దక్షిణ దశ మారుతోంది

- వేగంగా ఎన్‌హెచ్ 716 విస్తరణ
- ఏడాదిన్నరలో అందుబాటులోకి..

మొత్తం రోడ్ల నిర్మాణం: 37.43కి.మీ
మల్లవరం నుంచి రేణిగుంట (కేఎల్‌ఎం సర్కిల్)దాకా: 17.40 కి.మీ
తమిళనాడు/ఏపీ సరిహద్దు పుత్తూరు సెక్షన్: 20.03కి.మీ
ఇరువైపులా సర్వీస్ రోడ్డు దూరం: 32 కి.మీ
నిర్మాణ వ్యయం: రూ.862.11కోట్లు
నిర్మాణ సమయం: రెండు సంవత్సరాలు
పూర్తి చేయాల్సిన తేదీ: 13-12-2026
నిర్మాణ సంస్థ: టీపీఎఫ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, వాయాన్స్ సొల్యూషన్స్ లిమిటెడ్

తిరుపతి నగరం దక్షిణ దిశగా విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరానికి దక్షిణంగా ఉన్న పల్లెల ప్రజలకు జాతీయ రహదారిని దాటడం అనే ప్రాణాంతక సమస్యకు పరిష్కారం లభిస్తోంది. ఆరు వరసలుగా విస్తరణ జరుగుతున్న జాతీయ రహదారిపై కొత్త ఫ్లైవోవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఇందువల్ల రోడ్డు ప్రమాదాలకు అవకాశముండదు. ట్రాఫిక్ జామ్‌లు ఉండవు.

తిరుపతి-ఆంధ్రజ్యోతి

చిత్తూరు-నాయుడుపేట ఆరు లేన్ల రహదారిలో సి.మల్లవరం నుంచి రేణిగుంట కేఎల్‌ఎం కూడలి దాకా మాత్రమే నాలుగు లేన్ల రహదారి ఉండిపోయింది. దీన్ని కూడా ఆరు లేన్ల రహదారిగా విస్తరించే పనులు జోరుగా సాగుతున్నాయి. 17.40 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారిపై కొత్తగా మూడు ఫ్లైవోవర్లు, 5 అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. సర్వీస్ రోడ్లు ఉంటాయి. 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే' గా రూపుదిద్దుకుంటున్న ఈ జాతీయ రహదారి తిరుపతి నగర విస్తరణలో కీలక పాత్ర పోషించబోతోంది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ 2024 నవంబరు 5న దీనికి నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి ఎన్‌హెచ్ 716గా నామకరణం చేశారు. ఇప్పటివరకు 11 శాతం పనులు పూర్తయ్యాయి. ఏడాదిన్నరలో పూర్తిగా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం విస్తరణ పనులతో పాటు రామానుజపల్లె, మల్లవరం వద్ద అండర్ పాస్ పనులు మొదలుపెట్టారు.

యాక్సెస్ కంట్రోల్డ్ హైవే ప్రత్యేకతలు

వేగంగా, సురక్షితంగా వాహనాలు ప్రయాణించేలా ఈ హైవే నిర్మాణం జరుగుతోంది. హైవేను క్రాస్ చేసే అవసరం ఎక్కడా ఇక ఉండదు. హైవేకి సమాంతరంగా అటూ, ఇటూ సర్వీస్ రోడ్లు ఉంటాయి. హైవే మీదకు ఎక్కడానికీ, దిగడానికీ ఈ సర్వీస్ రోడ్లలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి. పశువులు హైవే మీదకు వచ్చే వీలే లేకుండా బారికేడ్లు నిర్మిస్తారు.



గందరగోళం.. కెఎల్‌ఎం సర్కిల్



ఇక్కడ కూడా ఫ్లైవోవర్ వస్తుంది

మూడు ఫ్లైవోవర్లు

హైవేపై మూడుచోట్ల ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం కేఎల్‌ఎం ఆసుపత్రి కూడలి గందరగోళంగా ఉంటుంది. తిరుపతి నుంచి నాయుడుపేట వైపునకు వెళ్లే ఆరు వరసల హైవేలోంచి చెన్నైకి నాలుగు వరసల కూడలి చీలుతుంది. ఇదే కూడలిలో రేణిగుంట నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఇక్కడ ఎటు నుంచి ఎటు తిరగాలో అర్థంగాక వాహనదారులు గందరగోళపడుతుంటారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాగే మల్లవరం కూడలి కూడా ప్రమాదాలకు దారితీసేలా ఉంది. ఈ రెండు కూడళ్ల వద్దా ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. అలాగే అవిలాల క్రాసింగ్‌లో మరొక ఫ్లైవోవర్ నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ ఆగిపోతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి.

ఐదు అండర్ పాస్‌లు

మల్లవరం కూడలి నుంచి కేఎల్‌ఎం కూడలి దాకా అనేక చోట్ల హైవేను క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది. ఆర్సీపురం, పచ్చికాపలం వరకూ ఉన్న పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇందుకు పరిష్కారంగా అడర్‌పాస్‌ల నిర్మాణం జరుగుతోంది.

- పేరూరు జంక్షన్, రామానుజపల్లె చెక్‌పోస్ట్ జంక్షన్‌లలో భారీ వాహనాలు సైతం వెళ్లేలా(వీయూపీ) అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.
- తనపల్లి క్రాస్, తిరుచానూరు జంక్షన్‌లలో కార్లు, మినీ వ్యాన్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా ఎల్‌వీయూపీ అండర్ పాస్‌లు నిర్మిస్తారు. ఇది 4.5 మీటర్ల ఎత్తు ఉంటుంది.
- ఎమ్మార్‌పల్లి - మల్లవరం రోడ్డులో ఉప్పరపల్లి జంక్షన్‌లో కార్లు, బస్సులు వెళ్లేలా (ఎస్‌వీయూపీ)అండర్ పాస్ నిర్మిస్తారు. ఈ అండర్‌పాస్ 5.5మీటర్ల ఎత్తు ఉంటుంది.



ఆదమరిస్తే అంతే.. తిరుచానూరు జంక్షన్



ఇక్కడ అండర్‌పాస్ నిర్మిస్తారు



డేంజరస్ సర్కిల్.. ఈ తనపల్లి క్రాస్

టోల్ తప్పదు

యాక్సెస్ కంట్రోల్డ్ హైవే మీదకు నగరంలో నుంచి ఎక్కాలనుకుంటే మాత్రం టోల్ ఫీజు చెల్లించాలి. ప్రస్తుతం హైవేపై మేర్లపాక వద్ద, పాకాల వద్ద టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఇవి కాకుండా సర్వీస్ రోడ్డులోంచి ఎక్కే దగ్గర కూడా టోల్‌బూత్‌లు పెడుతారు. హైదరాబాద్‌లోని అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్ల తరహాలో ఇవి ఉంటాయి. కింది ప్రాంతాల్లో టోల్‌బూత్‌లు ఉంటాయి. ఎంటర్ చేసిన ప్లాజా నుంచి ఎగ్జిట్ ప్లాజా వరకు ప్రయాణ దూరం ఆధారంగా టోల్ వసూలు చేస్తారు. రెండు బస్ షెల్టర్లు కూడా ఏర్పాటు చేస్తారు.

- తిరుపతి నుంచి మదనపల్లె వెళ్లే మార్గంలో సీ.మల్లవరం జంక్షన్ వద్ద
- శ్రీకాళహస్తి నుంచి చిత్తూరు వెళ్లే వైపు తొండమనాడు దగ్గర
- ఆర్సీపురం జంక్షన్ (అవిలాల క్రాస్) వద్ద
- గాజులమండ్యం జంక్షన్ (ఫ్లైఓవర్ కింద చెన్నై మార్గంలో)
- నగరి దగ్గర రెండు

ఈ కూడలి ప్రమాదకరం



ప్రస్తుతం హైవేల్లో మర్రిగుంట కూడలి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఎయిర్ పోర్టు వైపునుంచి తిరుపతి వైపునకు వస్తున్నపుడు రేణిగుంట చెక్‌పోస్టు నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఈ కూడలి గందరగోళంగా ఉండడంతో వేగంగా ప్రయాణించే వాహనాలు హఠాత్తుగా ఎటు మళ్లాలో అర్థం కాక సడన్ బ్రేకు వేసి పల్టీలు కొడుతున్నాయి. ఇక్కడ సురక్షితమైన కూడలి గానీ, ఫ్లైవోవర్ గానీ అవసరం.

ఇంటి సమీపానికి ఒంటరి ఏనుగు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు పెరట్లోకి రావడంతో ఆ కుటుంబ సభ్యులు వణికిపోయారు. ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ చిన్నరామాపురానికి చెందిన సల్లకుంట్ల సుధాకర్ నాయుడికి ఊరికి ఆనుకొని పొలం ఉంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి పక్కనే వున్న పశువుల నీటి తొట్టెలో ఓ ఏనుగు నీరు తాగుతుండటం చూసి ఆ రైతు తీవ్రభయాందోళన చెందారు. ఆయన కుమారుడు ధైర్యంగా వెళ్లి ఇంటి ఆవరణలోని ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి హారన్ మోగించడంతో గజరాజు నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోయింది. అప్పటికే చెరకు, టమోటా, కూరగాయల పంటలను తిని ధ్వంసం చేసింది. ఫారెస్టు అధికారులు ఏనుగుల సంచారం ఇవ్వడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తొట్టెలో నీరు తాగి వెళ్లిపోతున్న ఏనుగు

ఉచిత ఇసుక విధానం భేష్

- పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాసరాజు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం లోడింగ్, రవాణాలకు నామమాత్రంగా ఛార్జీలను తీసుకుంటూ ఉచితంగా ఇసుకను అందించడం గొప్ప విషయమని ఎస్‌ఎల్‌వీ గ్రూప్ అధినేత పెనుమత్స శ్రీనివాసరాజు కొనియాడారు. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం ఏటా పాదయాత్రగా తిరుమల వస్తానని మొక్కుకున్న ఆయన క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 13న విజయవాడలో పాదయాత్ర ప్రారంభించి బుధవారం అలిపిరికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షలా మారిందన్నారు. ఫలితంగా నిర్మాణాలు నిలిచిపోయి అభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం రూ. 200 లోడింగ్, రవాణా ఛార్జీలతోనే ఇసుక అందించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పదిరోజుల క్రితం చేపట్టిన పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసి శ్రీవారి వద్దకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.



గరుడ సర్కిల్ వద్ద కుటుంబ సభ్యులతో పెనుమత్స

రుయాకు బ్రోన్కోస్కోప్ వితరణ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యశోదా ఆస్పత్రుల ఇంటర్వెన్షనల్ పల్మలనాజిస్ట్ డాక్టర్ హరికిశన్ రుయాస్పత్రిలోని పల్మనాలజీ విభాగానికి రూ.5 లక్షల విలువచేసే బ్రోన్కోస్కోప్‌ను అందించారు. బుధవారం రుయాలో ప్రిన్సిపాల్ రవిప్రభు, సూపరింటెండెంట్ రాధలకు దాన్ని అప్పగించారు. రుయాస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దాతలు ముందుకు రావడం చాలా గొప్ప విషయమని వారు పేర్కొన్నారు. ఇటువంటి ఖరీదైన వైద్య పరికరాలతో శ్వాసకోశ వ్యాధులను ముందుగానే గుర్తించి, వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు, వైద్యాధికారులు మధుసూదన్, మనోహరన్, అజయ్‌కుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లకు బ్రోన్కోస్కోప్‌ను అందజేస్తున్న వైద్యులు

రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నామని డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలను మాత్రమే యథావిధిగా కొనసాగిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, పక్కన ముఖ్య అతిథి రామస్వామి, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో బుధవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ మాట్లాడుతూ చంద్రయాన్-3 మిషన్ ద్వారా ఇస్రో 2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంతో భారత్ కీర్తి పెరిగిందని, ఈ విజయానికి గుర్తుగా ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా రాష్ట్రాల్లో 7 చోట్ల ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ మాజీ కార్యదర్శి టి.రామస్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకొంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ముత్త చెర్రియన్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు ఉన్నత పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్

- దాతృత్వం చాటుకున్న ఎన్నారై వెంకటతేజ పేరం



ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు, వెంకటతేజ కుటుంబ సభ్యులు

పెళ్లకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ విప్లవం నడుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రవాసాంధ్రుడు వెంకటతేజ పేరం అన్నారు. తన స్వగ్రామమైన పెళ్లకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెంకటతేజ యంగ్ మైండ్స్ ఏఐ హబ్ పేరుతో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పేరం మధుసూదన్ నాయుడు, జ్యోతమ్మ, పేరం రమేష్‌నాయుడు, చంద్రబాబు నాయుడు, సందీప్‌తేజ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటతేజ వీడియో ద్వారా తన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. తాను పుట్టిన ఊళ్లో విద్యార్థులు ఏఐ టెక్నాలజీపై అవగాహన పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంలో యంగ్ మైండ్స్ ఏఐ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ ద్వారా కృతిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) రోబోటిక్స్, కోడింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డేటా సైన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందిస్తామన్నారు. తద్వారా సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన సామర్థ్యం పెరిగి అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే అవకాశం లభిస్తుందన్నారు.ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన తన స్నేహితులు కార్తీక్‌రాజు, నిమిష్, వసంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థులు ఏఐ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని సాంకేతిక రంగంలో రాణించాలని పేరం సోదరులు ఆకాంక్షించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, నాయకులు గాలి రాజేష్ నాయుడు, విజయ్‌కుమార్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు,బైనా చంద్రశేఖర్‌రెడ్డి, అక్కరపల్లి గోపాల్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్ రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, మునీష్, తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

గజదాడుల నివారణకు ప్రణాళిక రూపొందించండి

- తలకోనలో అధికారులకు కలెక్టర్ ఆదేశం



ఎర్రావారిపాలెం, ఆగస్టు 13; పంట పొలాలపై ఏనుగుల దాడుల నివారణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందిచాలని అటవీశాఖ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. అదే సమయంలో ఏనుగుల రక్షణ ముఖ్యమన్నారు. వన్య ప్రాణులు, అటవీ సంరక్షణకు సంబంధించి బుధవారం ఆయన తలకోనలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అడవుల్లో వన్య ప్రాణుల రక్షణకు అనువైన వాతావరణం కల్పించాలన్నారు. అటవీ,వన్య ప్రాణుల చట్టలను కఠినంగా అమలు చేస్తూ మరోపక్క పంట పొలాలపైకి ఏనుగుల దాడుల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టం జరగకుండా, రైతులు ప్రాణాలు కోల్పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ వివేక్, సీసీఎఫ్ఓ సెల్వం, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మూషిక వాహనంపై గణనాథుడు



పాకాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహోత్సవాలు బుధవారం ఉదయం శ్రీకారం చుట్టుకున్నాయి. ఉభయదారులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. సాయంత్రం కలశ స్థాపన హోమం జరిగింది. రాత్రి వినాయకస్వామి మూషికవాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. అయిదు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 17న జరిగే ఉత్సవానికి భారీగా భక్తులు తరలిరానున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం: కురుగొండ్ల



శేషగిరి రావుకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు

వెంకటగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం అంధ క్రీడాకారుడు ముప్పాళ్ల శేషగిరి రావుకు మాధవ నాయుడు తమ ఐటీఎం ట్రస్టు ద్వారా రూ.1.60 లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అలాగే కురుగొండ్ల కూడా కొంత నగదు అందించారు. అనంతరం ముప్పాళ్ల శేషగిరి రావును, నరసయ్య నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్లయిండ్ స్పోర్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పరుచూరు నరసయ్య నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాస్ గంగాధరం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, వెంకటగిరి మండల టీడీపీ అధ్యక్షుడు మురళి, లింగసముద్రం సింగిల్ విండో అధ్యక్షుడు రంగినేని రాజా, పెరిమిడి మాజీ సర్పంచ్ మురళి, పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు కోటేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, గొల్లపల్లి సొసైటీ డైరెక్టర్ పావులూరు భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం: విజయశ్రీ

నాయుడుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముక లాంటి అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని విజయవంతంగా అమలు చేసిన నేపథ్యంలో బుధవారం నాయుడుపేటలో నాయకులు, రైతులు భారీ ఎత్తున ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో ఉన్న విజయగణపతి దేవస్థానం నుంచి అంబేద్కర్ విగ్రహం, శ్రీకాళహస్తి బైపాస్ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ స్వయంగా ట్రాక్టర్ నడిపారు. ఈ ర్యాలీలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, జనసేన ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నెలవల రాజేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనరు కామిరెడ్డి అశోక్‌రెడ్డి, అరవ పెరిమిడి చంద్రారెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్, ఆకుతోట రమేష్, సంచి కృష్ణయ్య, విజయకుమార్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, మురళీరెడ్డి, మైలారి రాజశేఖర్, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, మెండెం బాబు, సుజాతమ్మ పాల్గొన్నారు.

కురుగొండ సొసైటీ కమిటీ బాధ్యతల స్వీకారం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఓజిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) త్రీమెన్ కమిటీ బుధవారం బాధ్యతలు చేపట్టింది. చైర్మన్‌గా దారా అంకయ్య, డైరెక్టర్లుగా కొండూరు రవీంద్రరాజు, అలిమిలి మల్లికార్జునరెడ్డిను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరికి సీఈవో రవి బుధవారం బాధ్యతలు అప్పగించారు. చైర్మన్, సభ్యులను టీడీపీ నాయకులు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన వెంకయ్య మోటారు సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంకయ్యను నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రపు నాచుమొక్కల పెంపకంతో
మత్స్యకారులకు జీవనోపాధి



నాచుమొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న రాజేష్

వాకాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచుమొక్కల పెంపకం ద్వారా తీరప్రాంత మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగుపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ తెలిపారు. మండలంలోని కొండూరుపాళెంలో మత్స్యకారులకు బుధవారం సముద్ర నాచుమొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆదాయ మార్గాలను కల్పించి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు తీర ప్రాంతాల్లో సముద్ర నాచుమొక్కల పెంపకం జీవనోపాధి మార్గంగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రెడ్డినాయక్, సందీప్, యశ్వంత్, టీడీపీ నాయకులు దోసకాయల కృష్ణమూర్తి, కుంచెం దయాకర్, కల్లూరు హరీష్ నాయుడు, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, మత్స్య సంఘం నాయకుడు పూడి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుమార్తెకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

డక్కిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చీర్ల అయ్యపరెడ్డి కుమార్తె అనూషారెడ్డి వివాహం బుధవారం జరిగింది. ఆమెను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆశీర్వదించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, మురళి తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలి

నాయుడుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఇంటా పండుగలా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. బుధవారం స్థానిక గాంధీ మందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ ఫజులుల్లా తదితరులు

గ్రావెల్ టిప్పర్ల స్వాధీనం

తడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరదయ్యపాళెం మండలం విట్టాలాయపాళెం నుంచి చెన్నైకు టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలివెలుతున్న సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. బుధవారం రాత్రి భీములవారిపారిపాలెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు, మైనింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. చెన్నైకు గ్రావెల్ తీసుకువెళ్తున్న ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు. కాగా, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరే గ్రావెల్ టిప్పర్లు పట్టుబడడానికి కారణమని తెలిసింది.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన: పాశం



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనను అందిస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మసీదు వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి పథంలోకి నడిపిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల ఆదరణను పొందుతోతుందని చెప్పారు. ఇప్పటికే సూపర్‌సిక్స్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత గ్యాస్ సిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణాన్ని ప్రారంభించనుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, నాజర్, జహంగీర్, సద్దాం, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజల ముందుకు: విజయశ్రీ



బాపూజీ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు 'గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు బాపూజీ కాలనీలో ఆమె పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామని అక్కడ ప్రజలకు తెలియజేశారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, సిమెంటు రోడ్లు నిర్మించాలని స్థానికులు విన్నవించారు. డ్రైనేజీ కాలువలను నిర్మించి, శ్మశాన వాటికను కూడా ఏర్పాటు చేస్తామని, అలాగే తాగునీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా, ఉదయం నుంచే తేలికపాటి జల్లులు పడుతున్నా ఎమ్మెల్యే వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, నాయకులు అలవల శ్రీనివాసులు, మేడా సాయినారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి చర్యలు

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో చర్యలు చేపట్టినట్లు నీటి సంఘం అధ్యక్షుడు హేమకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం చెన్నూరు చెరువులో నేలమడుగు వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెరువు ఆయకట్టు కింద వెయ్యికి పైగా ఎకరాల్లో చెన్నూరు, తిప్పవరప్పాడు గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయం సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. నేలమడుగు వద్ద నీరు వృథా అవుతుండడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఆయన సహకారంతో మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు.

గోకులకృష్ణలో రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గూడూరు ఏరియా ఆస్పత్రి, ఏపీ వైద్య విధాన పరిషత్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 60విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస బాబా, ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్, ఏవో మనోహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర



పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువెళుతున్న గ్రామస్తులు

తడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తడలో పోలేరమ్మ జాతర బుధవారం మొదలైంది. ఉదయం పోలేరమ్మ బండ వద్ద గ్రామస్తులంతా అంబళ్లను తీసుకువచ్చి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పోలేరమ్మ సోదరి చల్లాతమ్మకు పొంగళ్లు పెట్టారు. రాత్రి పోలేరమ్మ, పోతురాజు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరింపజేసి గ్రామోత్సం నిర్వహించారు.

ఫ్లెక్సీల తొలగింపు

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీహీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు సూళ్లూరుపేటలో ఆగస్టు 15న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పట్టణంలో పలుచోట్ల భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫెక్సీలను మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా తొలిగించారు. చిరంజీవి యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమంత్ కుమార్ శర్మ మాట్లాడుతూ మున్సిపాలిటీ అధికారులు ఏకపక్షంగా ఫ్లెక్సీలు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల ఫెక్సీలను అలాగే ఉంచి సేవా కార్యక్రమానికి సంబంధించిన ఫెక్సీలు, బ్యానర్లను తొలగించడాన్ని ఖండించారు. దీనిపై కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా సెంటర్ లైట్ విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టరాదని, అందుకే తొలిగించామన్నారు.

రెండో రోజూ కొనసాగిన ధర్నా

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద బుధవారం రెండోరోజు ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి గ్రాట్యుటీ అందజేయాలన్నారు. కార్యక్రమంలో వెంకయ్య, వెంకటేశ్వర్లు, బాషా, ప్రవీణ్, కృష్ణ, పోలయ్య, చక్రపాణి, రాము తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీతో జీలుగలు

ఓజిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు 50 శాతం రాయితీతో జీలుగలు సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయాధికారి వరప్రసాద్ తెలిపారు. 26 పంచాయతీలకు మొదటి విడతగా 25 టన్నులు, రెండవ విడతగా 19 టన్నుల జీలుగలు వచ్చాయని తెలిపారు. కిలో జీలుగలు రూ.123 కాగా 50 శాతం రాయితీతో రూ.61.50 చెల్లించాల్సి వుంటుందన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్, ప్రధాని నరేంద్రమోదీపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ జాతీయ కార్యదర్శి శివనాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఆయన సేవలను గుర్తించి ప్రపంచ దేశాలే గౌరవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు గౌడ్, వెంకటరామయ్య, మోహన్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలోని కన్యకా పరమేశ్వదేవి ఆలయంలో బుధవారం అమ్మవారికి వాసవి మహిళా సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ



చిల్లకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో బుధవారం శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. గ్రామానికి చెందిన మిద్దె నాగయ్యశెట్టి, శ్రీదేవి సహకారంతో ఋణ విమోచన శ్రీకృష్ణ మందిరం నిర్మించి శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ పూజా కార్యక్రమా ల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, బాలకృష్ణమ నాయుడు, మిద్దె నాగయ్య, శ్రీదేవి, యశ్వంత్, ఇంద్రసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంచడానికే ఉల్లాస్

వాకాడు, ఆగస్టు, 13 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ఉల్లాస్ కార్యక్రమం తోడ్పడుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాసులకు అక్షరాలు నేర్పించడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. వలంటీర్లు గ్రామాల్లో నిరక్షరాసులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పోలమ్మ, ఏపీవో విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర ఉల్లాస్‌పై శిక్షణ

బాలాయపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో మండలంలోని వీవోఏలకు అక్షర ఆంధ్ర ఉల్లాస్‌పై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో వినీల్‌కుమార్ మాట్లా డుతూ ప్రతి వీవోఏ వారి పరిధిలోని నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, ఏపీఎం కిరణ్, ఏపీవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి: ఆరుగురి అరెస్ట్

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని అంబేద్కర్ గురుకులం సమీపంలో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఎస్ఐ పవన్‌కుమార్ దాడులు జరిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.6,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డీఎల్‌డీవో వాణీరెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వమిత్వ ఇంటి పన్ను వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలని, అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో వేణు, అధికారులు పాల్గొన్నారు.

గూడలి సర్పంచి ప్రత్యక్షం

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి సర్పంచి ఉడపల ఆదెమ్మ బుధవారం ప్రత్యక్షం కావడంతో తహసీల్దారు జయజయరావు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. జూన్ 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆదెమ్మ అదృశ్యమయ్యారు. ఆమె భర్తతో పాటు పంచాయతీ అధికారులు పోలీసుకు ఫిర్యాదు చేశారు. రెండు నెలల తరువాత ఆదెమ్మ ప్రత్యక్షం కావడంతో తహసీల్దారు జయజయరావు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇళ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

వాకాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల సర్వేని పకడ్బందీగా చేయాలని డీడీవో వాణిరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలం కార్యాలయంలో ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష చేపట్టారు. మ్యాప్‌లను పరిశీలించారు. కొండూరు, మొలగనూరు, రెడ్డిపాళెం గ్రామాల మ్యాప్‌ల సమగ్ర భూసర్వేల్లో ఇళ్ల సర్వే పకడ్బందీగా చేయాలని సూచించారు. అలాగే తడిచెత్తను, పొడిచెత్తను వేరుగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పెళ్లకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి కేవీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని చిల్లకూరు, పుల్లూరు గ్రామాల్లో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతి ఆచరించడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాలకు చావాలి పంచాయతీలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో విజయభారతి, వీఏఏ మహేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్

పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా సుబ్బారావు



నాయుడుపేటటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా నానాబాల సుబ్బారావును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే బాబు, మంజుల, శిరీషా, హైమావతి, నర్మద, సురేష్, సుబ్బలక్ష్మీ, రవీంద్ర, మునిసురేష్‌లను సభ్యులుగా నియమించారు.

కమనీయం సంగమేశ్వరుడి కల్యాణం



సంగమేశ్వరుడు, కామాక్షీదేవి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల సంగమేశ్వరాలయ ప్రాంగణంలోని కామాక్షీదేవి కుంబాభిషేకంలో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉభయకర్తలు రాకేష్‌చౌదరి కుటుంబ సభ్యులు అనసూయమ్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు కార్తీక్‌శర్మ, వేద పండితులు కల్యాణాన్ని జరిపించారు. అంతకుముందు కామాక్షీదేవి విగ్రహాన్ని పతిష్టించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి వచ్చిన భక్తులకు నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

వీల్ చైర్ అందజేత



తేజస్‌కు ఎలక్ట్రిక్ వీల్‌చైర్ అందజేస్తున్న టీడీపీ నాయకులు, దాతలు

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురానికి చెందిన మానసిక వికలాంగుడు తేజస్‌కు చెన్నైకి చెందిన గిరిధర్‌రెడ్డి దాతృత్వంతో రూ.49వేల విలువచేసే ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను షిరిడిసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, కోటమ్మ ఆలయ చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో దాత గిరిధర్‌రెడ్డితో పాటు అక్షయ సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోండి



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీనివాసులు

పుత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మారుతున్న కొత్త సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని భవిష్యత్తు ప్రణాళికలను తయారు చేసుకోవాలని ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ బ్యూరో చీఫ్ శ్రీనివాసులు చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం కెరీర్ ప్లానింగ్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన డిప్లొమా తర్వాత ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఇంటర్వ్యూలకు సన్నద్ధత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

పుత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చెడు సావాసాలు, సోషల్ మీడియా ప్రభావంతో యువత మాదక ద్రవ్యాలకు బానిసలై మానసిక, శారీరక రోగాల బారిన పడుతున్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం- దుష్ప్రభావాలపై కళాశాలలో బుధవారం రాయలసీమ సేవా సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని కోరారు. రాస్ ప్రతినిధి నాగరాజు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పాపానాయుడుపేటలో డీ అడిక్షన్ సెంటర్ ఉందని తెలిపారు. అధ్యాపకులు కోటేశ్వరయ్య, సుజన, వాణిశ్రీ, వాసవి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టోత్తర శత కలశాభిషేకం



వడమాలపేట,ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అష్టోత్తర శత కలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు వేదామంత్రాలు పఠిస్తూ 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అంతకుముందు సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకార్యాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో అగ్నిహోమం నిర్వహించారు. ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడికి ఉదయం 8 గంటల నుంచి 10 మధ్య 108 కలశాలతో అష్టోత్తర నామాలు పఠిస్తూ అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతినెలా రెండో బుధవారం రూ.516 చెల్లించి, సంప్రదాయ దుస్తులతో అష్టోత్తర శత కలశాభిషేకం పాల్గొనవచ్చని ఆలయ అధికారి వేణుగోపాల్ చెప్పారు.

అక్రమ క్వారీలను రద్దు చేయండి

వామపక్షాల డిమాండ్



ధర్నాకు వెళ్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

సత్యవేడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమర్తి కండ్రిగలో జరుగుతున్న అక్రమ క్వారీలను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. చమర్తి కండ్రిగ గిరిజనులు అడవులకు వెళ్లే బాటను ఆక్రమించిన క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బుధవారం సీపీఐ, సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మైనింగ్ యాక్ట్ ప్రకారం నివాస ప్రాంతాలకు రెండు కిలోమీటర్ల దూరంలో క్వారీలు నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ చమర్తికండ్రిగ గిరిజన కాలనీకి 300 మీటర్ల సమీపంలో విచక్షణా రహితంగా పేలుళ్లు, లోతుగా తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతోందని తెలిపారు. సమాచారం అందుకున్న ఆర్ఐ సురేష్.. ధర్నా స్థలానికి చేరుకుని నాయకులతో చర్చించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విచారణ ముగిసే వరకు క్వారీ నిర్వాహణను ఆపాలని యాజమాన్యానికి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నియయోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకుడు మురళి, గిరిజనులు పాల్గొన్నారు.

కార్బన్ పరిశ్రమ ఎదుట కార్మికుల ధర్నా



కార్మికులతో చర్చిస్తున్న పోలీసులు

రేణిగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రమ దోపిడీ ఆపాలంటూ కార్బన్ పరిశ్రమ మొదటి షిఫ్టులో విధులకు హాజరైన 1400 మంది కార్మికులు ధర్నా చేశారు. బుధవారం ఉదయం తిరుపతి విమానాశ్రయం సమీపంలోని కార్బన్ పరిశ్రమ వద్ద కార్మికులు రెండు గంటల పాటు ధర్నా చేయడంతో ఉద్రిక్త వాతావరణం తలెత్తింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర సిబ్బందితో పరిశ్రమకు చేరుకొని ధర్నాకు దిగిన కార్మి కులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... కార్బన్ కంపెనీ అనుబంధ సంస్థ లియో లింక్ యాజమాన్యం తమ శ్రమ దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. రోజుకు 8 గంటలు పని చేయాల్సి ఉండగా, 12గంటలు చేయించుకుంటోందన్నారు. ఇక పరిశ్రమలో మౌలిక వసతులు లేవని, సరైన భోజనం కూడా పెట్టడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని చెప్పారు. ప్రతి నెలా అదనంగా జీతం నుంచి కటింగులు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కార్బన్ పరిశ్రమకు చెందిన అస్గర్ కార్మికులతో మాట్లాడుతూ... సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తానని, జీతాల్లో కోతలపై కూడా చర్చిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో కార్మికులు తిరిగి విధులకు హాజరయ్యారు.

మా పాఠశాల విలీనాన్ని ఆపండి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకునే పాఠశాల తమ కాలనీలోనే ఉండాలని మండలంలోని యార్లపూడి పంచాయతీ రాజుగుంట ఎస్సీ కాలనీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇక్కడి పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను మన్నవరం పాఠశాలలో విలీనం చేయవద్దన్నారు. దీని వలన తమ పిల్లలు ఇబ్బందులు పడుతారన్నారు. తమ కాలనీలోనే పాఠశాల ఉండే విధంగా కలెక్టర్ చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కూల్చి వేసిన ఇళ్ల పరిశీలన

రేణిగుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు కూల్చివేసిన ఇళ్లను సీపీఐ నాయకులు పరిశీలించారు. బుధవారం జీపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న రిజర్వుడు పోరంబోకు భూమిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 77 ఇళ్లను నిర్మించగా ఇటీవల రెవెన్యూ అధికారులు వాటిని కూల్చి వేశారు. సీపీఐ జిల్లా నాయకులతో కలిసి ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు నిర్మించుకున్న ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చి వేయడం తగదన్నారు. నష్టపోయిన పేదలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, మణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలేరమ్మ జాతర

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపెళ్లూరు గ్రామదేవత పోలేరమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఇందులో భాగంగా పోలేరమ్మ విగ్రహానికి పాలభిషేకం చేసి, అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం పోలేరమ్మను గ్రామంలో ఊరేగించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

కేవీబీపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సదాశివపురం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వడ్డెర సంఘం నాయకుడు నవీన్ కుర్చీలను వితరణ చేసారు. చిన్నారులకు, అంగన్‌వాడీ వర్కర్ల కోసం 20 కుర్చీలను వితరణ చేసారు.

రేపు ఆర్డీవో కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సుధీర్ చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ జరగనున్నట్లు ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారన్నారు.

చల్లంగా దీవించు తల్లీ!

నడివీధి గంగమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో నడి వీధి గంగమ్మ - అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు - గంగమ్మ సేవలో మబ్బు దేవనారాయణ రెడ్డి

రేణిగుంట ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం మూడో రోజు తెల్లవారు జామున గంగమ్మ అత్తగారి ఇల్లైన చాకలి ఇంటి నుంచి పసుపుతో తయారుచేసిన గంగమ్మ ప్రతిరూపాన్ని ఊరేగిస్తూ నడి వీధి త్రిశూలం వద్దకు చేర్చారు. ఆనవాయితీలో భాగంగా భక్తులు అమ్మవారి ముందు కుంభం పోశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. రాత్రి వేప తడికలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి ఊరి పొలిమేర్లలో నాలుగు దిక్కుల తిరిగిన అనంతరం అమ్మవారి శిరస్సును మేళ తాళాలతో, డప్పు వాయిద్యాల నడుమ జలజలో కలపడంతో జాతర సమాప్తమైంది.

మూతపడిన రైతు సేవా కేంద్రం



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుల పెళ్లూరులోని రైతు సేవా కేంద్రం బుధవారం అనధికారికంగా మూత పడింది. కార్యాలయ సిబ్బంది బుధవారం విధులకు హాజరు కాలేదు. వివిధ పనుల నిమిత్తం సేవా కేంద్రానికి వచ్చిన రైతులు మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండి సిబ్బంది రాకపోవడంతో వెనుదిరిగారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని రైతులు తెలిపారు.

మూడు దుకాణాల్లో చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూడు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగడులు చోరీకి పాల్పడ్డారు. బేకరి, కూల్‌డ్రింక్స్ షాప్, జనరల్ స్టోర్సులో మంగళవారం రాత్రి రూ.50వేలకు పైగా చోరీ చేసినట్లు దుకాణదారులు తెలిపారు. బేకరిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో నిందుతుడును చోరీ చేసే దృశ్యాలు నమోదయ్యాయి. దుకాణ యజమానులు చంద్రశేఖర్‌శెట్టి, హిమాచలం, శరవణ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసి సీసీ ఫుటేజీని అందజేశారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు చోరీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

17న మెగా ఉచిత వైద్య శిబిరం

తిరుపతి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్, మహాత్మపూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, దళిత నేత అంజయ్య తెలిపారు. బుధవారం బాలాజీకాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మాజీ మంత్రి పరసారత్నం సతీమణి పి.కస్తూరమ్మ 5వ వర్ధంతి సందర్భంగా 17న ఆదివారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని రకాల జబ్బులకు పరీక్షలు చేసి, మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా పల్లకీసేవ



శ్రీకాళహస్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పల్లకీసేవ జరిగింది. ముందుగా స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ధ్వజానికి పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శపించడంలో జగన్‌రెడ్డి దిట్ట



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శపించడంలో మాజీ సీఎం జగన్ దిట్ట అని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పులి వెందుల నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను సామ, దాన దండోపాయాలతో లొంగదీసుకుని నియంతృత్వాన్ని ప్రదర్శించారన్నారు. ప్రస్తుతం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో జగన్‌రెడ్డి తమ పార్టీ ఓటమి తప్పదని గ్రహించాడన్నారు. సీఎం చంద్రబాబును వ్యక్తిగతంగా దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో తండ్రి పేరు ఎవరో కూడా తెలియని వారితో దొంగ ఓట్లు వేయించిన చరిత్ర జగన్ రెడ్డి బృందానిదే అన్నారు. ప్రజాస్వామ్యంగా జరిగి ఎన్నికల్లో టీడీపీ తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు దశరథాచారి, గాలి చలపతి నాయుడు, వన్నియకుల క్షత్రియ సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు మునిరాజాయాదవ్, వజ్రంకిషోర్, కోట చంద్రశేఖర్, భీమాల భాస్కర్, మణి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాల కోసం తప్పని తిప్పలు

కేవీబీపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సచివాలయాల్లోకి వెళితే అక్కడ సిబ్బంది సక్రమంగా విధులుకు హాజరు కాక, సమయానికి కార్యాలయాలు తెరవకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే కేవీబీపురంలోని మీసేవ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందంటున్నారు. తమ గ్రామాల్లోనే అన్ని సేవలు అందిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని కోరుతున్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ... ఈనెల 15 శుక్రవారం వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకుందామన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహరావు, మాలతి గ్యాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నిరసన



శ్రీకాళహస్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం అధ్యాపకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బదిలీలు చేపట్టాలని, రీడెసిగ్నేషన్ ఇవ్వాలని, ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వంలో విలీనం చేసిన జీవో 42ను తక్షణమే రద్దు చేయాలన్నారు. సీఏఎస్ నోటిఫికేషన్ తక్షణమే ఇవ్వాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తీరిన లోవోల్టేజీ సమస్య



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయ సమీపంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించారు. దీంతో సమీపంలోని మూడు వీధుల్లో లోవోల్టేజీ సమస్య తీరినట్లైంది. ఏఈ చలపతి, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవోపా నూతన కార్యవర్గం



శ్రీకాళహస్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం అవోపా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటిలింగాల శశిధర్, ఉపాధ్యక్షులుగా అయితా మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మురారి జె.స్వరూప్, సంయుక్త కార్యదర్శిగా గునుపూటి సుమిత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ... కేఆర్ కృష్ణయ్య శెట్టి 1995లో అవోపా ట్రస్టును స్థాపించారన్నారు. వైశ్య విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడం కోసం ప్రత్యేక విద్యా ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. రూ.50లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో నిరుద్యోగ యువతకు ఆర్థికసాయం చేస్తామన్నారు.

ముగిసిన సంస్కృత వారోత్సవాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా జాతీయ సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన సంస్కృత భాషా వారోత్సవాలు ముగిశాయి. సంస్కృత భాషా సాహిత్యాంశాలపై నిపుణుల ప్రసంగాలు, విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను కేరళలోని చిన్మయా యూనివర్సిటీ ప్రొ-వైస్ చాన్స్‌లర్ గీర్వాణి అందజేశారు. మన దేశ విజ్ఞానానికి మూలం సంస్కృతమేనని అభిప్రాయపడ్డారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు సంస్కృత భాషా సాహిత్యాల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ నారాయణరావు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగనందాపురం ప్రభుత్వ పాఠశాలకు శ్రీసిటీ - వీఆర్‌వీ పరిశ్రమ చేయూత

- రూ.31 లక్షలతో వసతుల కల్పన



సత్యవేడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని చార్ట్ - వీఆర్‌వీ పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా వరదయ్యపాళెం మండలం నాగనందాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.31 లక్షలతో పలు వసతులను సమకూర్చారు. నూతన తరగతి గది నిర్మాణంతో పాటు అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, వంటగది, ప్రహరీని పూర్తి చేశారు. బుధవారం శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా రెడ్డి సమక్షంలో చార్ట్ ఇండస్ట్రీస్ ఎండీ సర్వేశ్ మిట్టల్, హెచ్ఆర్ డైరెక్టర్ యామినిసిన్హా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేశ్ మిట్టల్ మాట్లాడుతూ... శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించేందుకు తమ సంస్థ ముందుంటుందన్నారు. చార్ట్ - వీఆర్‌వీ పరిశ్రమల చొరవను నిరీషా సన్నారెడ్డి అభినందించారు. వీఆర్‌వీ హెచ్‌ఆర్ మేనేజర్ కందస్వామి, వరదయ్యపాళెం ఎంఈవో గున్నయ్య, వీఆర్‌వీ, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబైన తిరుపతి విమానాశ్రయం

రేణిగుంట ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం ముస్తాబైంది. బుధవారం ఉదయం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం భవనానికి మూడు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలిగించడంతో త్రివర్ణ పతాకం రంగుల వెలుగులు చూపర్లను ఎంతగానో ఆకర్షిస్తోంది.

ఏపీఎం రజనిపై దాడి అమానుషం



వెలుగు కార్యాలయం వద్ద సెర్ప్ ఉద్యోగుల నిరసన

నారాయణవనం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండ మండలానికి చెందిన ఏపీఎం రజనికుమారిపై జరిగిన దాడి అమానుషమని నారాయణవనం మండల వెలుగు సెర్ప్(ఎస్ఈఆర్‌పీ) ఉద్యోగులు పేర్కొన్నారు. బుధవారం వెలుగు కార్యాలయ ఆవరణలో సెర్ప్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెర్ప్ ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు టి.ధనంజయ రెడ్డి మాట్లాడుతూ... ఇలాంటి దుశ్చర్యలను సహించమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేంద్రరావు, ఏపీవో సుకన్య, సుదర్శన్‌రాజు, అరుణ్‌కుమార్, రాజేశ్వరి, నిమ్మి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు



ఎంపీ ప్రభాకర రెడ్డి దంపతులకు ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.